క్లుప్తంగా

మంత్రిని కలిసిన మైనారిటీ నాయకులు


మంత్రితో మాట్లాడుతున్న మైనారిటీ నాయకులు

సదుం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డినికి మండలానికి చెందిన ముస్లిం మైనారిటీ నాయకులు తిరుపతిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిశారు. తమ సమస్యలను ఆయనకు నివేదించారు. సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సయ్యద్‌బాషా, ఖాజీ సైపుల్లా, అంజాద్, రసూల్, ఇమ్రుద్దీన్, షబ్బీర్ పాల్గొన్నారు.

మెకానిక్‌ల సంఘ అధ్యక్షుడికి సన్మానం

పుంగనూరు: పట్టణ మెకానిక్‌ల సంఘ అధ్యక్షుడు బండకుమార్‌కు రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి సన్మానం చేశారు. ఆదివారం తిరుపతిలో మెకానిక్‌ల అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. పలు సమస్యలపై చర్చించారు. రాష్ట్ర ప్రతినిధులు ఆవుల మునిరెడ్డి, లక్ష్మణరావు, తేజోరెడ్డి కలసి కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అజ్మతుల్లా, ఖాదర్‌వల్లి, సుధాకర్, అబ్దుల్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రులకు సన్మానం


సన్మానం పొందిన గాయిత్రి తదితరులు

పుంగనూరు: పట్టణానికి చెందిన పలువురు కవయిత్రులకు విజయవాడలో శనివారం రాత్రి ఘన సన్మానం చేశారు. పట్టణానికి చెందిన హసీనాబేగం, గాయిత్రి, స్రవంతిలకు విజయవాడలో తెలుగు భాషాద్యోమ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూర్ణచంద్రుడు ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల కవుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పట్టణానికి చెందిన ముగ్గురు మహిళలకు శాలువలు కప్పి, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. పట్టణ ప్రముఖులు వీరిని అభినందించారు.

వాహనదారులకు హెల్మెట్లు తప్పనిసరి

రొంపిచెర్ల: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలని ఎస్‌ఐ కృష్ణయ్య అన్నారు. అయన ఆదివారం తిరుపతి–పీలేరు రహదారిలోని రొంపిచెర్ల క్రాస్ రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ, వాహనదారులు ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్లు వాడాలన్నారు. ఎక్కువ స్పీడ్‌తో వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు గురి కారాదని హితవు పలికారు. ఆటోలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రయాణికులను తరలించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు.

సమస్యల సాధనకు ఐక్య పోరాటం

పలమనేరు: సమస్యల సాధన కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని స్థానిక విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గురురాజారావు అన్నారు. పట్టణంలోని ఎన్‌జీఓ హోమ్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘ నాయకులు గౌస్, అక్బర్‌బాషా, జానకి రామయ్య, బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక


సమావేశమైన విశ్రాంత ఉద్యోగులు

పలమనేరు: పట్టణంలో బస్టాండు సమీపంలోని రిక్రియేషన్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి, కార్యదర్శిగా ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. సభ్యులు నూతన పాలకవర్గాన్ని అభినందించారు. మాజీ ఎమ్మెల్యే ఆంజనేయులు, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు రెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షులు సుధాకర్, ఏఎంసీ మాజీ చెర్మన్ ప్రహ్లాద, ఆస్పత్రి కమిటీ అధ్యక్షులు చెంగారెడ్డి, జైకుమార్, లక్ష్మీపతి, బాలాజీ యాదవ్ పాల్గొన్నారు.

15న జాతీయ సమైక్యతా ర్యాలీ

పలమనేరు: 15న స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలో మంగళవారం పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా ర్యాలీ నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యం పిళ్లై, నరసింహులు తెలిపారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ర్యాలీ విజయవంతం చేసే విషయమై చర్చించారు.

భగవద్గీతపై ప్రచారం

కుప్పం రూరల్: భగవద్గీత పఠనంతోనే విశ్వ శాంతి సాధ్యమని ప్రబోధానంద సేవాసమితి కుప్పం ప్రతినిధి కృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని గుల్లేపల్లెలో ప్రబోధానంద రచించిన పుస్తకాలపై ప్రచారం నిర్వహించారు.

లంచావతారులు

- పాస్‌బుక్‌కు రూ.15 వేలు, పొజిషన్ సర్టిఫికెట్‌కు రూ.5వేలు
- చేయి తడవనిదే పని చేయని వీఆర్‌ఓ, వీఆర్‌ఏ

రెవెన్యూ శాఖలో వేళ్లూనుకుపోయిన అవినీతిని ప్రక్షాళన చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. అయితే అక్కడ కూడా వీఆర్వోలే కీలకంగా మారడంతో వారి అవినీతికి అడ్డుకట్ట పడటం లేదు. లంచాలు మరిగి వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలను డబ్బుల కోసం పీడిస్తున్నారు. చేయి తడవనిదే కల్లుపల్లె వీఆర్‌ఓ, వీఆర్‌ఏలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.


పొరంబోకు భూమిని ఆక్రమించుకునేందుకు తలారి సురేష్ జేసీబీతో చదును చేయించిన ప్రాంతం

గంగవరం: కల్లుపల్లె వీఆర్‌ఓ సురేష్, వీఆర్‌ఏ (తలారి) సురేష్ ఇద్దరూ ఇద్దరే. లంచం ఇవ్వనిదే ఏ పనీ చేయరని వీళ్ల గురించి శాపనార్థాలు పెట్టేవారు అనేకం. ఇక్కడ విధుల్లో చేరిన సంవత్సరంలోనే వీఆర్‌ఓ లంచావతారిగా పేరు తెచ్చుకున్నారంటే వారి అవినీతి ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

వారి లంచాల చిట్టాలో మచ్చుకు కొన్ని

- కల్లుపల్లె రెవెన్యూ పరిధిలో పొజిషన్ సర్టిఫికెట్ల కోసం రత్నమ్మ, బోయకొండమ్మ నుంచి రూ.5 వేల చొప్పున వసూలు చేశారు. అయితే సర్టిఫికెట్లు ఇవ్వాలంటే మొత్తం రూ.15వేలు డిమాండ్ చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు.
- కల్లుపల్లె పరిధిలోని రమాదేవి, రత్నమ్మ, సావిత్రమ్మకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వడానికి రూ.3వేల చొప్పున నిర్లజ్జగా వారి నుంచి వసూలు చేశారు.
- గ్రామ వలంటీర్ ఇందు తన ఆధార్‌కార్డులో తండ్రి పేరు తొలగించి భర్త పేరును చేర్చుకోవడం కోసం (డాటరాఫ్ నుంచి వైఫాఫ్)కి మార్చుకునేందుకు కేవలం తహసీల్దార్ సంతకానికి రూ.వెయ్యి డిమాండ్ చేయగా, ఆమె రూ.500 ఇచ్చారు. మిగిలిన రూ.500 లంచం కోసం తలారి సురేష్ ఆమెను రోడ్డుపై నిలదీస్తుండడం గమనార్హం!

ప్రతి పనికీ ఓ రేటు

భూ సర్వే	:రూ.3000
మరణ ధ్రువీకరణ పత్రం	:రూ.1000
జనన ధ్రువీకరణ పత్రం	:రూ.1000
పొజిషన్ సర్టిఫికెట్	:రూ.3 వేల నుంచి -5 వేలు
మ్యుటేషన్	:రూ.10 వేల నుంచి 20 వేలు

- కల్లుపల్లెకు చెందిన అన్నదమ్ములు గంగాధర్, శేషాద్రి తమ తండ్రి పేరున 478/2ఏ, 2బీలో 1.39 ఎకరం, 475/11బిలో 0.85 సెంట్లు భూమిని తండ్రి మరణానంతరం తమ పేరిట మార్చుకునేందుకు పాస్‌బుక్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే రెండు పాస్‌బుక్‌ల కోసం ఇద్దరి నుంచి రూ.30 వేలు డిమాండ్ చేశారు. చివరకు రూ.20 వేలు వారి నుంచి తీసుకున్నారు.
- బూడిదపల్లెలో కొన్నేళ్ల కిందట మరణించిన రత్నప్ప భూమిని కోడలు సుభావతి పేరున మార్చుకునేందుకు సర్వేతో పాటు పాస్‌బుక్ కోసం మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకుంది. సర్వేతో పాటు భూమిలో పూర్తిగా హద్దులు వేసి పాస్‌బుక్ ఇవ్వాలంటే రూ.30 వేలు ఇవ్వాలంటూ వీఆర్‌ఓ సురేష్ డిమాండ్ చేయడంతో చివరకు ఆమె రూ.20 వేలు ఇచ్చింది. అయినా పాస్‌బుక్ మాత్రం ఇవ్వకుండా మిగిలిన డబ్బు కోసం వేధిస్తున్నారని ఆమె వాపోతోంది.


వీఆర్‌ఓకు లంచం ఇచ్చిన తరువాత శేషాద్రి పేరిట అందిన భూమి పాస్‌బుక్

కబ్జాదారుల అవతారమెత్తి..!

వీఆర్‌ఏ సురేష్ రెవెన్యూ పరిధిలో ఎక్కడ పొరంబోకు భూమి ఉందో ముందుగా స్కెచ్‌లో పరిశీలించి, ఆ భూమిని జేసీబీతో చదును చేసి ఆక్రమణలకు పాల్పడుతున్నడనే ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా దీనిని ప్రశ్నిస్తే తాము తీసుకునే లంచాల్లో అధికారులకు కూడా ఇవ్వాల్సి ఉంటుందని, ఈ ఆక్రమణలు కూడా వాళ్లు చెబితేనే చేస్తున్నానని చెప్పడం కొసమెరుపు. దీనిపై తహసీల్దార్ అమరనాథ్‌ను వివరణ కోరగా.. కల్లుపల్లె వీఆర్‌ఓ, వీఆర్‌ఏ సురేష్ లంచం తీసుకున్నట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే, విచారణ చేసి అవసరమైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం


ఒంటిపల్లెలో లబ్ధిదారులకు బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్సీ భరత్

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్సీ భరత్

గుడుపల్లె: సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వైఎస్‌ఆర్ సీపీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ అన్నారు. ఆదివారం మండలంలోని కుప్పిగానిపల్లె గ్రామ పంచాయతీ ఒంటిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. గ్రామంలోని 85 కుటుంబాలను కలిసి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. ఇళ్ల వద్ద మురుగు నీరు నిలిచిపోతోందని, మురుగు కాలువలు నిర్మించాలని గ్రామస్తులు కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. సీసీ రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువలు నిర్మిస్తామన్నారు. సచివాలయ పరిధిలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రూ.రూ 20 లక్షలు మంజూరు చేస్తోందని, వీటితో అభివృద్ధి పనులు చేయిస్తామన్నారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద మిగిలిన పనులను చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, సర్పంచ్ రామమూర్తి, ఎంపీటీసీ వెంకటేష్, గోపి వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


సమావేశమైన పూర్వ విద్యార్థులు

గంగవరం: పెద్దపంజాణి మండలం నిడిగుంట జెడ్పీ హైస్కూల్‌లో 1985–86లో పదవ తరగతి చదివిన అప్పటి విద్యార్థులు ఆదివారం స్థానిక ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో సమ్మేళనం నిర్వహించారు. పరస్పర పరిచయాలతో జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న తమ స్నేహితుల్లో ఇద్దరికి రూ.10వేల చొప్పున అందజేశారు. ఇకపై ప్రతి ఏటా జూలై మొదటి వారంలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో రత్నారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, భాస్కర్, చిన్నరెడ్డెమ్మ, అరుణతో పాటు మొత్తం 35 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

యాదవ్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి


పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రాజునాయక్, హరికృష్ణ నాయక్ తదితరులు

పుంగనూరు: రాష్ట్ర బీసీవైపీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని అతని డ్రైవర్ రాజునాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం రాజునాయక్‌తో పాటు రాష్ట్ర అధ్యక్షుడు బుక్యా హరికృష్ణ నాయక్ కలసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు.. ఈనెల 8న యాదవ్ తన ఇంటి వద్దకు రావాలని రాజునాయక్‌కు మెస్సేజ్ పంపాడు. తన కుమార్తెను తీసుకుని యాదవ్ ఇంటి వద్దకు వెళ్లేసరికి రామచంద్ర యాదవ్‌తోపాటు అతని భార్య, ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది, బౌన్సర్లు, ఇతరులు చూస్తుండగానే నానా దుర్భాషలాడుతూ కులం పేరుతో దూషించాడు. అంతు చూస్తానని బెదిరించాడు. కులం పేరుతో దూషించి, బెదిరించినందుకు అతనిపై కేసు నమోదు చేసి, తనకు రక్షణ కల్పించాలని రాజునాయక్ పోలీసులను కోరాడు. వ్యక్తిగత కారణాలతో రాజు నాయక్ రెండ్రోజులు యాదవ్ వద్ద పనికి వెళ్లకపోవడంతో అతడు ఇలా వీరంగం చేసినట్లు తెలిసింది. అతని వెంట రాష్ట్ర ప్రతినిధులు బుక్యా ప్రభాకర్ నాయక్, ముడే శీనసాయక్, శంకర్ నాయక్, బాణావతి శ్రీనివాసులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

డ్రైవర్ రాజునాయక్ ఫిర్యాదు మేరకు రామచంద్ర యాదవ్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మోహన్‌కుమార్ ఆదివారం సాయంత్రం తెలిపారు. యాదవ్‌పై క్రైమ్ నంబర్:285/2023గా కేసును వివిధ సెక్షన్ల కింద నమోదు చేసినట్లు చెప్పారు.


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న రుత్వికులు

కల్యాణం.. కమనీయం

పలమనేరు: శ్రావణ అధికమాసం సందర్భంగా పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం శ్రీనివాసుని కల్యాణోత్సవం భక్తజన సందోహం నడుమ కనుల పండువగా నిర్వహించారు. స్వామి వార్లకు ప్రత్యేక అలంకరణ చేసి, శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. పట్టణానికి చెందిన 116మంది దంపతులు హాజరై స్వామి వారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల నాయకులు సుభాష్ చంద్రబోస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన


కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

బైరెడ్డిపల్లె: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం చెన్నై శంకర్ నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరంలో 60 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి, వారిలో 26 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వారిని చెన్నై శంకర్ నేత్రాలయ ఆసుపత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు మురళీక్రిష్ణ, శ్రీనివాసులు, చంద్ర, చిన్నబ్బ, గౌరప్ప తెలిపారు.

వైద్యుల రక్షణ చట్టాలను పటిష్టం చేయాలి

- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ


ఐఎంఏ శాఖ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ

గంగవరం: వైద్యుల రక్షణ చట్టాలను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం స్థానిక ఐఎంఏ శాఖను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, ఇటీవల వైద్యులపై భౌతిక దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వైద్యుల రక్షణ చట్టాన్ని తీసుకొచ్చారని, తర్వాత కాలంలో ఈ చట్టాన్ని పలు రాష్ట్రాలు అమలు చేశాయన్నారు. అయితే పోలీస్ మాన్యువల్ మేరకు ఏడేళ్లలోపు శిక్షలకు సంబంధిత స్టేషన్లలోనే బెయిల్ పొందే అవకాశం ఉండడంతో నేరస్తులు ఈ చట్టాలకు ఏమాత్రం బెదరడం లేదన్నారు. ఇదలా ఉంచితే, రాష్ట్రం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం రోగులకు ఎంతో మేలుగా ఉందన్నారు. ఇందులో రోగాల పరిధిని పెంచడంతో మరింత సౌలభ్యంగా మారిందని, దీనికి తాము ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. 20 పడకల ఆస్పత్రులకు సైతం ఆరోగ్యశ్రీని వర్తింపచేయాలని, ప్రైవేటు ఆస్పత్రుల ఏర్పాటులో రాయితీలను ప్రకటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అర్హత, శిక్షణ లేకుండా ఎడాపెడా వెలుస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలపై కఠిన చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైద్య విధానాల రూపకల్పనలో ఐఎంఏను భాగస్వామిగా చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫణిధర్, ఉపాధ్యక్షులు మనోరంజన్‌రెడ్డి, పలమనేరు శాఖ అధ్యక్షులు యుగంధర్, ట్రెజరర్ మల్లికార్జున రెడ్డి, పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్, సభ్యులు డాక్టర్ బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఓటర్ల సర్వే


కల్లూరులో ఇంటింటా సర్వే చేస్తున్న సిబ్బంది

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కల్లూరు పంచాయతీ దిగువవీధిలో ఆదివారం ఇంటింటా ఓటర్ల సర్వే నిర్వహించినట్లు స్పెషలాఫీసర్ శ్రీనివాసులు తెలిపారు. ఓటర్ల జాబితా ప్రకారం ఆయా ఇళ్లకు వెళ్లి లిస్టులోని పేర్లను పరిశీలించారు. ఆర్‌ఐ దొరస్వామి, వీఆర్‌ఓలు శకుంతల, మౌనిక, వెల్ఫేర్ అసిస్టెంట్లు భరత్, ప్రకాష్ పాల్గొన్నారు.

నీలం టన్ను రూ.1.10 లక్షలు



నీలం మామిడి, కవర్లు చుట్టిన మామిడి కాయలు

పలమనేరు: మామిడి సీజన్ ముగుస్తున్న దశలో మార్కెట్‌కు వచ్చే నీలం మామిడి ధరలు ఆకాశానంటుతున్నాయి. ప్రస్తుతం నీలం మామిడి టన్ను రూ.1.10 లక్షలు పలుకుతోంది. దీంతో పలమనేరు ప్రాంతంలోని మామిడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నీలం ధరలు పెరగడంతో లాభాల బాటలో పయనిస్తున్నారు. మండలంలోని రంగినాయనిపల్లెకు చెందిన గాలి జమున తన ఎకరా మామిడితోటలో నీలం మామిడి సాగుచేసింది. ప్రస్తుతం పంట కోతకొచ్చింది. దీంతో ఇటీవలే రెండు టన్నుల మామిడిని బంగారుపాళెం మార్కెట్‌కు తరలించింది. అక్కడ అనూహ్యంగా ధర పెరిగి రూ.1.10 లక్షలకు ఆమె తమ మామిడికాయలను విక్రయించింది. దీనికి కారణం తాను సహజ పద్ధతుల్లో మామిడిని సాగు చేయడమే కాకుండా కాయలకు కవర్లను కట్టడంతో సరుకు నాణ్యంగా ఉందని, దీంతో వ్యాపారులు పోటీపడి అధిక ధరకు కొనుగోలు చేసినట్లు చెప్పారు.

మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆదరించండి


జరావారిపల్లె సచివాలయాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే


కోటూరులో లబ్ధిదారులకు బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మాయమాటలు చెప్పి, తప్పుడు హామీలను ఇచ్చేవారిని నమ్మరాదని, కష్టకాలంలో కూడా ప్రజలకు మేలు చేసిన జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించాలని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ విజ్ఞప్తి చేశారు. మండలంలోని మండిపేట కోటూరు సచివాలయ పరిధిలో ఆదివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వారు పొందిన వివిధ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. అయన కోటూరులో మాట్లాడారు. ఈ నాలుగేళ్లలో జనం ముఖం చూడని టీడీపీ నాయకులు ఇప్పుడు ఊర్లలోకి వచ్చి మభ్య పెట్టేందుకు యత్నిస్తున్నారని, నాడు కోవిడ్‌లో తమ ప్రాణాలు పోతున్నా అప్పుడు మీరంతా ఏమయ్యారని జనం వారిని నిలదీయాలని కోరారు. పార్టీలు, కులమతాలకు సంబంధం లేకుండా అర్హత కలిగిన ప్రతి ఇంటికీ తమ ప్రభుత్వ పాలనతో రూ.50 వేల నుంచి అత్యధికంగా రూ.20 లక్షల దాకా లబ్ధి చేకూరిందన్నారు.

జరావారిపల్లెలో సచివాలయం ప్రారంభం

జరావారిపల్లె గ్రామ సచివాలయాన్ని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలసి ఎమ్మెల్యే ప్రారంభించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ, బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం జగనన్న చొరవతో నిజమైందన్నారు. మన ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయాల వ్యవస్థపై అధ్యయనం చేసిన కేంద్ర ప్రభుత్వం సైతం ఈ విధానాన్ని జాతీయ స్థాయిలో అమలు చేసేందుకు సిద్ధమవుతోందని తెలిపారు. అనంతరం ఎం.కోటూరులో రూ.6లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ రోజా, పార్టీ మండల కన్వీనర్ బాలాజీ నాయుడు, వైస్ ఎంపీపీలు జయశ్రీ, గజేంద్ర, సర్పంచుల సంఘ అధ్యక్షులు విశ్వనాథ రెడ్డి, సచివాలయ అధ్యక్షులు తిరుమలేష్, రాష్ట్ర కార్యదర్శి రంగన్న, గ్రామ సర్పంచ్ చినపాప, జరావారిపల్లె సర్పంచ్ వనితకళ, గోవిందరాజులు, ఎంపీటీసీ రమేష్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు జగమర్లలో..

జగమర్లలో ఆర్‌బీకే కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను ఎమ్మెల్యే వెంకటేగౌడ సోమవారం ప్రారంభించనున్నారని, అలాగే నాభూమి–నాదేశం కార్యక్రమంలోనూ ఆయన పాల్గొంటారని ఎంపీడీఓ విద్యాసాగర్ తెలిపారు.